క్లుప్తంగా

శిక్షణతో స్వయం ఉపాధి పొందాలి



శిక్షణ పూర్తి చేసుకున్న యువకులతో అధికారులు

రాయచోటి టౌన్ : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశుసం వర్ధక శాఖ వర్క్స్‌కు ఇచ్చిన శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ సూచించారు. మంగళవారం అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండల పరిధిలోని తాళ్లపాక గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో యువతకు 45 రోజులు పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి సర్టిఫికెట్లను అందించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న మెళుకవలను నేర్చుకొని వాటి ద్వారా స్వయం ఉపాధి పొందాలని చెప్పారు. ఆర్గనైజర్ అంజనారాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పక్కాగృహాల పరిశీలన



లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హైదర్‌వలీ

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు గ్రామం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలకు సంబంధించిన జగనన్న కాలనీలోని పక్కాగృహాలను మండల అభివృద్ధి అధికారి హైదర్‌వలీ మంగళవారం పరిశీలించారు. ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ జగనన్న పక్కాగృహాలను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, త్వరగా పూర్తి చేస్తే గృహానికి సంబంధించిన బిల్లులు లబ్ధిదారులకు త్వరగా అందుతాయని తెలిపారు. ఆయనతో పాటు సచివాలయం సిబ్బంది, గువ్వలచెరువు గ్రామ ఎంపీటీసీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి



విద్యార్థి శోభన్‌ను అభినందిస్తున్న దృశ్యం

సంబేపల్లె : ఈ నెల 3వ తేదీన తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో సంబేపల్లె ఆదర్శ పాఠశాలకు చెందిన శోభన్‌బాబు అండర్-19 విభాగంలో వెనుక ఈత పోటీలో జాతీయ స్థాయికి ఎంపికై నట్లు ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శోభన్‌ను ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

చిన్నమండెం : ఆన్‌లైన్‌లో జరుగుతున్న రుణం ఇచ్చేటువంటి యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చదువుకున్న చాలా మంది నిర్లక్ష్యంతోను, అమాయకత్వంతోను సమస్యను అంచనా వేయకపోవడం వలన ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో రుణం ఇచ్చే యాప్స్ బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. సులువుగా సెల్ ఫోన్‌లోనే రుణం వస్తుందని, తరువాత తీర్చుకోవచ్చులే అని, రుణం తీసుకొని, తిరిగి చెల్లించలేక, రుణం ఇచ్చిన కంపెనీల వారు చేసేటువంటి వేధింపులు భరించలేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి వాటి జోలికి వెళ్లకూడదని ఎస్‌ఐ రమేష్‌బాబు ప్రజలకు సూచించారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన సంబేపల్లె నాయకులు



ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

సంబేపల్లె : మండలానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మంగళవారం కలికిరిలో రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి, వడ్డి వెంకటరమణారెడ్డితో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను సన్మానించారు. అనంతరం మండలంలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

- దప్పేపల్లె గ్రామ పంచాయతీలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి
- పూర్తయిన రహదారులను ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించిన గడికోట



లక్కిరెడ్డిపల్లె: ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జగనన్న సుపరిపాలన సంక్షేమ విప్లవంగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఇంటా ఘనస్వాగతం, ఆత్మీయ ఆదరణతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాయచోటి నియోజకవర్గంలో వేడుకగా కొనసాగుతోంది. సంక్షేమ, అభివృద్ధి పథకాలను పారదర్శకంగా సంతృప్తి స్థాయిలో తమ గడప వద్దకే చేరవేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజానీకం నిండు మనస్సుతో ఆశీర్వదిస్తోంది. సమస్యలు తెలుసుకుంటూ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తుండటంతో మంచి స్పందన లభిస్తోంది. మంగళవారం లక్కిరెడ్డిపల్లె మండలం, దప్పేపల్లె గ్రామంలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దప్పేపల్లె గ్రామంలోని హరిజనవాడ, దప్పేపల్లె, వీరారెడ్డిగారిపల్లె, చిన్న నాగిరెడ్డిగారిపల్లె, కొండావాండ్లపల్లె, విజయనగరం, కె.కొత్తపల్లె, వల్లూరి వాండ్లపల్లెలలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సంక్షేమ బావుటాను పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

దప్పేపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గం రూ. 3 లక్షలతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయిస్తామని గ్రామస్తులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ బిల్డింగ్ అసంపూర్తి పనులకు రూ. 5 లక్షల నిధులతో పూర్తి చేయించాలని ఎస్సీ కాలనీ నుంచి చెరువు కట్టకు వెళ్లే మార్గంలో కల్వర్ట్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరగా వెంటనే పనులు ప్రారంభించాలని శ్రీకాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దప్పేపల్లె అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రమాదేవి, మార్కెట్ యార్డు చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు సమహసింహారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, తహసీల్దార్ నాగ ప్రసన్న లక్ష్మి, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ కిషోర్, ఉద్యానశాఖ అధికారి నాగమణి, ఉప సర్పంచ్ నరేష్, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కృషితో లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామంలోని వీరారెడ్డిగారిపల్లె ప్రజల ఏళ్లనాటి కల నెరవేరింది. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సహకారంతో రూ. 1.27 కోట్ల నిధులతో రహదారి నిర్మాణాలు పూర్తయ్యాయి. మంగళవారం హర్షధ్వానాల మధ్య ఆ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దప్పేపల్లె గ్రామంలో రూ. 1.04 కోట్ల నిధులతో నిర్మాణాలు పూర్తయిన కొండావాండ్లపల్లె - విజయనగరం రహదారిని ఆయన ప్రారంభించారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

రాయచోటి టౌన్ : ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని ఆదిల్ నగర్‌లో అదనంగా ప్రారంభిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. గడప గడపకు కార్యక్రమంలో స్థానికులు లో ఓల్టేజ్ వలన సమస్యగా ఉందని తెలుపగా వాటిని పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడి

మామిడి రైతులకు ప్రకృతి వ్యవసాయ అధికారి కాంతమ్మ సూచన

లక్కిరెడ్డిపల్లె : మామిడిలో పూత దశలో ఘన, ద్రవ జీవామృతాలతో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారి కాంతమ్మ పేర్కొన్నారు. మంగళవారం దప్పేపల్లె పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో ఏట సోమశేఖర్ రెడ్డి 14 ఎకరాల మామిడి తోటకు 25 టన్నుల ఘణ జీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘణ, ద్రవ జీవామృతం ఒక్కొక్క చెట్టుకు 20 కేజీలు పెడితే మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. 30 కేజీలు శనగపిండి, 30 కేజీలు బెల్లం, 300 లీటర్ల నాటు ఆవు మూత్రం, 150 కేజీల పేడ, పుట్టమన్ను, 200 లీటర్ల డ్రమ్ములలో 300 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేసుకోవచ్చన్నారు. జీవామృతాల ద్వారా పూత బాగా పెరిగి మంచి ఫలితాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐఎంఏ సరస్వతీ, యూనిట్ ఇన్‌చార్జ్ కె గంగిరెడ్డి, ఐసీఆర్‌పీలు మహేంద్ర, లక్ష్మి, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి

సిద్దవటం : మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీల హాజరును ఆన్‌లైన్ ద్వారా మేటీలు ఎలా పంపుతున్నారు, కొలతల ప్రకారం పనులను చేస్తున్నారా లేదా, మస్టర్‌లను ఎలా నిర్వహిస్తున్నారని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దవటం గ్రామ పంచాయతీలో జరిగిన సెరికల్చర్ పనులు, పండ్ల తోటల పనులు, హౌస్సింగ్ పనులు, సంపద తయారీ కేంద్ర పనులను పరిశీలించామన్నారు. ముఖ్యంగా రైతులతో మాట్లాడుతూ ప్రతి నెల మీకు రావలసిన చెల్లింపులు వస్తున్నాయా లేదా అని ఆరా తీస్తూ చెట్ల పెంపకాలు బాగా చేయాలని రైతులకు సూచించామన్నారు. కూలీలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఉపాధి సిబ్బందికి పీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ సాంబశివారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'జీఓ నెం.1ని రద్దు చేయాలి'

రాజంపేట : ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం .1ని రద్దు చేయాలంటూ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ జీఓ వల్ల ర్యాలీలు, ధర్నాలు, బహిరంగసభలు చేయరాదనే సంకేతాలను అందజేస్తుందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సీహెచ్ ఓబయ్య, వెంకటరమణ, ప్రసాద్, బాలాజీ, సురేష్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

చిట్వేలి : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ నెంబరు1ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ చిట్వేలి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ.సుజాత, కె.నానిలు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న జీఓ నెంబర్ 1ని రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్‌కు ఇచ్చే జీతం ఏమూలకు సరిపోవడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పందికాళ్ళ మణి, ఓబిలి పెంచలయ్యలు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు నాగరత్న, రమణ కుమారి, లక్ష్మీకుమారి, శాంతమ్మ, ఆటో యూనియన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఆటలు ఆడుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్ తదితరులు

రాయచోటి టౌన్ : ఆటలు ఆడుదాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందామని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ యువకులకు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువజన కేంద్రం, వీఆర్‌డీఎస్ వారు సంయుక్తంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. అందుకే ఆటలు ఆడి ఆరోగ్యాలను కాపాడుకోవాలని చెప్పారు. టోర్నమెంట్‌లో 9 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన వారికి డీఈఓ రాఘవరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల టీం ఆటగాళ్లు ప్రథమ బహుమతి, గాలివీడు ఆర్ ఆర్ కళాశాల టీం ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, నెహ్రూ యువజన కేంద్రం సిబ్బంది వెంకటేశ్వర్లు, బాలాజీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



ఓబులవారిపల్లె: పోటీలను ప్రారంభిస్తున్న సాయివికాస్



రాజంపేట: జ్ఞాపికను అందుకుంటున్న ఎస్‌ఐ మైనుద్దీన్

ఓబులవారిపల్లె : మానసికోల్లాసానికి శరీర ధృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముక్కావారిపల్లె పంచాయతీలోని క్రీడామైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు జిల్లా స్థాయిలో 25 క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని, గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ. 25 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ. 15 వేలు అందిస్తామని తెలిపారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. బాగా రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. అనంతరం సాయివికాష్ రెడ్డిని క్రీడాకారులు శాలువా, పూలమాలతో సత్కరించారు. సర్పంచ్ అరవ శ్రీధర్, ఎంపీటీసీ విజయ్ కుమార్, గుంతకల్లు రైల్వేబోర్డు కమిటీ సభ్యులు భరత్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, తల్లెం చంద్రమోహన్‌రెడ్డి, గజ్జల శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం

నందలూరు(రాజంపేట) : క్రీడలతో శారీరక దృఢత్వం కలుగుతుందని ఎస్‌ఐ మైనుద్దీన్ అన్నారు. మంగళవారం జెడ్పీ క్రీడామైదానంలో రాజువిద్యాసంస్థల అధినేత చమర్తి జగన్‌మోహన్‌రాజు సహకారంతో నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచి సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పోలీసులు తరపున ఆయన క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయన్నారు. పోలీసుల తరపున ఆడిన క్రీడాకారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియానేత మహేష్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, తోట శివశంకర్, సమ్మెట ఉమామహేష్, కొండిశెట్టి సుదర్శన్, మాడపూరి శ్రీరాములు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి

ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి



చలంపాలెం గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించిన సాయికిశోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : అర్హులందరికీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొర్లకుంట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్‌లతో ఎంపీడీఓ విజయారావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయికిశోర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అందించనటువంటి పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం ప్రజలకు అందజేస్తోందన్నారు. ప్రతి పథకం గురించి వలంటీర్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. సచివాలయ కన్వీనర్‌లు, పార్టీనాయకులు, కార్యకర్తలు సైనికులు మాదిరిగా పనిచేయాలని, వచ్చే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పంచాయతీలోని చెలంపాలెం గ్రామంలో వి సాయికిశోర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయారావు, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పర్యటించారు. తాగునీరు, నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్లు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించారు. గ్రామంలో సమస్యలు అభివృద్ధిపై ప్రజలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముక్కా రూపేష్ కుమార్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ వత్తలూరు రోహిణి కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆర్.వసుంధరమ్మ మంగళవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో తెలియజేశారు. రాజంపేట ప్రాజెక్టు పరిధిలోని రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు(6), సహాయకురాలి పోస్టులు(10), మినీ అంగన్‌వాడీ కార్యకర్తల (3) పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. రాజంపేట మండలంలోని నారంరాజుపల్లి (బీసీ-ఏ), మన్నూరు2(బీసీ-డీ), జాండ్రపేట(బీసీ-ఈ), రామ్‌నగర్ ఎస్టీ కాలనీ(ఎస్సీ), వెంకటరాజంపేట(ఓహెచ్), నందలూరు మండలంలోని నీలిపల్లి-1(ఓహెచ్-06)లో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలియజేశారు. అదే విధంగా రాజంపేట మండలంలోని చింతలకోన(బీసీ-ఏ), అంబేడ్కర్ కాలనీ(ఎస్టీ), నందలూరు మండలంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీ(ఓసీ)లలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలియజేశారు. రాజంపేట మండలంలోని శ్రీరంగరాజపురం(ఓసీ), హెచ్ కొత్తపల్లి(ఎస్), మందపల్లి-2(ఓసీ), పెనగలూరు మండలంలోని ఇండ్లూరు(బీసీ-ఈ), ఓబిలి హెచ్‌డబ్ల్యూ(ఓహెచ్), ఓదేటివారిపల్లి(బీసీ-బీ), కట్టావారిపల్లి(ఈడబ్ల్యూఎస్), నాయుడువారిపల్లి(బీసీ-ఈ), నందలూరు మండలంలోని కుంపుణీపురం(ఎస్సీ), నల్లతిమ్మాయగారిపల్లి హెచ్‌డబ్ల్యూ(ఎస్సీ) ఖాళీగా ఉన్నాయన్నారు. జూలై 1వ తేదీ 2023 నాటికి 21 సంవత్సరాలు దాటి 35 సంవత్సరాలలోపు వయస్సుతోపాటు వివాహమై ఉండాలన్నారు. ధృవపత్రాలతోపాటు సంబంధిత తహసీల్దారు జారీ చేసిన నివాస స్థల ధృవీకరణ సర్టిఫికెట్‌ను జతపరచాలన్నారు. కార్యకర్త పోస్టుకు 10వ తరగతి, సహాయకురాలు, మినీ అంగనవాడీ కార్యకర్త పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలియజేశారు. జనవరి 13వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రాజంపేట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేసి రశీదు పొందాలని కోరారు.

కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ

రాయచోటి టౌన్ : కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఈనెల 10వ తేదీ (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమీకృత కాల్ సెంటర్ నంబర్ 1967 ద్వారా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కాల్ సెంటర్ ద్వారా వినియోగదారులు (ప్రజలు) ప్రజా పంపిణీ వ్యవస్థ, బియ్యం కార్డు సేవలు, ధాన్యం సేకరణ, గ్యాస్/ పెట్రోల్/ డీజిల్ సరఫరా, తూనికలు/కొలతలు వంటి వాటి విషయాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

ఘనంగా అంతర్జాతీయ హిందీ దినోత్సవం




విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ హిందీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.బబిత హాజరై మాట్లాడారు. మన జాతీయ భాష హిందీ అని, ప్రపంచ వ్యాప్తంగా హిందీ దినోత్సవం జరుపుకోవడం ఎంతో గర్వకారణమన్నారు. హిందీ భాషకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉందని, ప్రపంచంలో అత్యధిక జనాభా మాట్లాడేటటువంటి భాషల్లో హిందీ మూడో స్థానంలో ఉందన్నారు. పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

పీఎం శ్రీ పాఠశాలలతో నాణ్యమైన విద్య

పాఠశాల విద్య కడప ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి

సంబేపల్లె : మౌలిక వసతులు కల్పించి సాంకేతిక సొబగులతో ప్రభుత్వ పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పాఠశాలల లక్ష్యమని పాఠశాల విద్య కడప ఆర్జేడీ మార్తాల వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. వివిధ మండలాలలో పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన కళాశాలల తనిఖీలలో భాగంగా మంగళవారం పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన మండలంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ పాఠశాలలో ఉన్న వసతులను, మరింత అభివృద్ధి పరచడానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను అందించేందుకు పీఎంశ్రీ పాఠశాలలు దోహదపడతాయన్నారు. పీఎంశ్రీ కింద ఎంపికైన బడుల్లో సొంత భవనాలు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలు, సౌరవిద్యుత్ ఏర్పాటు, శుద్ధజలం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ (ఐసీటీ) ల్యాబ్, క్రీడలకు ప్రోత్సాహం ఇచ్చి అందుకు అనుగుణంగా నిధుల కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహారెడ్డి, ఎంఈఓ శ్యామలాదేవి, ఏఎంఓ బాలాజీ, ఉపాధ్యాయులు అమీనా, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్.సురేంద్రనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రాజంపేటలోని 220 కెవిఎస్ఎస్, 132 కెవిఎస్ఎస్, 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం బుధవారం చేపడతామన్నారు. రాజంపేట పట్టణంతోపాటు రాజంపేట మండలంలోని తాళ్ళపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, సరస్వతీపురం, బావికాడపల్లి, కొండ్లోపల్లి, హెచ్.చెర్లోపల్లి, మందరం, పుల్లంపేట మండలంలోని దళవాయిపల్లి, టి.కమ్మపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, పుత్తనవారిపల్లి, పెనగలూరు మండలంలోని పెనగలూరు, కొండూరు, టి.జి.పల్లి, బెస్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు. వినియోగదారులందరూ సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ఉత్సాహంగా ముందస్తు సంక్రాంతి వేడుక

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల నరసింహులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలుగువారి సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయురాలు మేరి సువర్ణ సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి పాఠశాలలో ముగ్గులు వేసి గాలిపటాలు ఎగురవేశారు. భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ కమిటీ చైర్మన్ సుబ్బరత్నమ్మ, వైస్ చైర్మన్ కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది